ప్రజాశక్తి

బుధవారం 14 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

మీడియా సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు విద్యాసాగర్, ఇక్బాల్, శ్రీనివాసరావు తదితరులు

నేటి నుంచి ఉద్యమబాట

- ఉద్యోగ సంఘాల నేతల వెల్లడి
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- దశలవారీగా పోరాటం ఉధృతం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రభుత్వంతో జరిగిన చర్చల్లో పురోగతి లేనందున గతంలో ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ యధావిధిగా కొనసాగుతుందని ఎపి ఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను సత్వరమే చెల్లించాలని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వానికి వివిధ రూపాల్లో ఈ విషయాలను విన్నవించినా వాయిదాలే తప్ప పురోగతి కనిపించడం లేదన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణను వివరించారు. బుధవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని, తహశీల్దార్లు, సబ్ కలెక్టర్, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో తాలూకా కేంద్రాలు, పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నా చేపడతామన్నారు. 20న జిల్లా కలెక్టరేట్ల వద్ద ర్యాలీ, ధర్నా నిర్వహిస్తామని (మిగతా 6లో)

ఎన్నికల విధులకు ఉపాధ్యాయులు

- ఇప్పటికి 4700 మంది వివరాలు అప్‌లోడ్
- కొనసాగుతున్న ధృవీకరణ ప్రక్రియ
- ఎన్టీఆర్ జిల్లాలో 4898 మంది టీచర్లు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకునేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రాబోయే స్వారత్రిక ఎన్నికల విధుల్లో టీచర్లను నియమించాలని సిఈఓ నిర్ణయించిన విషయం తెలిసిందే. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులుగా ఉపాధ్యాయులను నియమించనున్నారు. ఆ మేరకు జిల్లాలోని ఉపాధ్యాయుల వివరాలను పంపాలని జిల్లా కలెక్టర్‌కు గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జిల్లా యంత్రాంగం వివరాలను సమర్పించింది. ఎన్టీఆర్ జిల్లాలో 948 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, కాంట్రాక్ట్, గురుకులాలు, ఎయిడెడ్, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎంపిపి ఇలా అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 4898 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరిలో ఎంత మందిని విధుల్లోకి తీసుకుంటారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 4700 మంది వివరాలను సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రస్తుతం అప్‌లోడ్ చేసిన వారి వివరాల పరిశీలన ప్రక్రియ సాగుతోంది. ఓటర్ గుర్తింపు కార్డుతోపాటు బ్యాంకు అకౌంట్ వివరాల ఆధారంగా వివరాలను ధృవీకరిస్తున్నారు. అనారోగ్యం వంటి సమస్యలు ఉన్న వారు తప్ప దాదాపు ఉపాధ్యాయులందరికీ ఎన్నికల విధుల్లోకి తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పరిశీలన, ధృవీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. రెండు దశలుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఉచిత, నిర్బంధ విద్య (విద్యా హక్కు చట్టం) నియమావళి-2010కి సవరణ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించొద్దని, విద్యకు సంబంధించిన కార్యకలాపాకే పరిమితం చేయాలని 2022లో ఉత్తర్వులు కూడా జారీ చేసింది. నాన్ అకాడమిక్ పనులకు ప్రభుత్వ శాఖల్లోని సిబ్బందిని వినియోగించిన తర్వాత మరింత మంది అవసరం అనుకుంటే పరిశీలించాలని ఆ ఉత్తర్తుల్లో పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు దూరంగా పెట్టి వారికి బదులుగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని వినియోగించుకోవాలనే ఉద్దేశంతోనే సిఎం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయితే దీనిని పక్కన పెట్టిన ఎన్నికల సంఘం ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు తీసుకోవాలని నిర్ణయించింది.

యువకులే బ్రాండ్ అంబాసిడర్లు

పూర్తిస్థాయి ఓటింగ్‌పై కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రతి ఒక్కరూ విలువైన ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడంలో యువతే బ్రాండ్అంబాసిడర్లుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరచడం-భాగస్వామ్యం చేయడం (స్వీప్) కార్యక్రమం మంగళవారం విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు నైతిక విలువలతో కూడిన ఓటింగ్ కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తమ కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల్లోని వారిని కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గత ఎన్నికల్లో ఎన్‌టీఆర్ జిల్లాలో మిగిలిన నియోజకవర్గాలతో పోల్చితే విజయవాడ అర్బన్ నియోజకవర్గాల్లో తక్కువ పోలింగ్ (మిగతా 6లో)

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ డిల్లీరావు

డిస్నీలాండ్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని

18న వాంబేకాలనీలో దీక్షలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : డిస్నీలాండ్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, గతం నుండి నివసిస్తున్న వారందరికీ రిజిస్ట్రేషన్ పట్టాలను తక్షణమే ఇవ్వాలని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరుతూ ఈ నెల 18న వాంబేకాలనీలో 24 గంటల నిరసన దీక్ష చేపడుతున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు తెలిపారు. పేదలకు ఇళ్లు, పట్టాలు ఇవ్వాలని, డిస్నీలాండ్‌లో కబేళా ఏర్పాటు ఆపాలని, దానిని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ మంగళవారం విజయవాడ వాంబే కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. పలుచోట్ల సభను నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో సభలు జరిపి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఎన్నికలు రాబోతున్న సమయంలో స్థలాలకు రిజిస్ట్రేషన్ పేరుతో మరో సరికొత్త నాటకానికి వైసిపి ప్రభుత్వం పూనుకుందన్నారు. గత ఇరవై ఏళ్ల నుండి నివసిస్తున్న వాంబే కాలనీ వాసులకు రిజిస్ట్రేషన్ పట్టాలిస్తామని ఆశ పెట్టి వేలాది రూపాయలు వసూలు చేశారని పేర్కొన్నారు. ఉచితంగా పట్టాలు ఇస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించారని తెలిపారు. డిస్నీలాండ్‌లోని 57 ఎకరాల ప్రభుత్వ స్థలం వధాగా ఉన్నా పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించకుండా, పశువులను వధించడానికి కబేళా ఏర్పాటుకు ప్రయత్నించడం శోచనీయమన్నారు. కబేళా పేరుతో డిస్నీలాండ్ స్థలాన్ని బడా కంపెనీలకు కట్టబెట్టడానికి పాలక పార్టీ నేతలు, నగరపాలక సంస్థ వారు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పేదల ఇళ్ల పట్టాల మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోందన్నారు. పట్టాల పేరుతో అధికార పార్టీ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారని, పట్టాల మంజూరులో కాలయాపన జరుగుతోందని అన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో ప్రజలను మోసగించారన్నారు. అద్దెలకు ఉన్న వారికి స్థలాలు కూడా చూపలేదన్నారు. ఇళ్ల నిర్మాణం పేరుతో లబ్ధిదారుల వద్ద నుండే డబ్బు వసూలు చేశారని, కానీ ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని, కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలిపోయాయని విమర్శించారు. గతంలోని తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఇదేవిధంగా పట్టాల పేరుతో డబ్బు వసూలు చేసి శూన్య హస్తం చూపిందన్నారు. కార్పొరేషన్లో వామపక్షాల (మిగతా 6లో)

పాదయాత్ర నిర్వహిస్తున్న సిహెచ్.బాబూరావు, కె.శ్రీదేవి తదితరులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ఉద్యోగ అవకాశాలు

విలేకర్లు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.

విద్యార్హత: ఇంటర్, ఆ పైన..

విలేకరులు కావాల్సిన కేంద్రాలు:

ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు

కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ

ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..

ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు

:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి

సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

హామీలను జిఒ రూపంలో విడుదల చేయాలి

డివిజన్లలో మునిసిపల్ కార్మికుల ధర్నా

తొమ్మిదో డివిజన్‌లో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: మునిసిపల్ కార్మికులు నిర్వహించిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఓ కాపీలను వెంటనే విడుదల చేయాలని, సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని కోరుతూ ఎపి మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా డివిజన్ల వారీగా కార్మికుల మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు జరుగుతున్నాయి. నగరంలోని గాంధీనగర్, సింగ్‌నగర్, కృష్ణలంక, దుర్గాపురం, పటమట తదితర ఏరియాల్లో మంగళవారం ధర్నాలు జరిగాయి. వాటర్,డ్రైనేజి, పార్కు, వెహికల్ డిపో, డిపి స్టేషన్లు, శానిటేషన్, మలేరియా తదితర విభాగాల కార్మికులు డివిజన్ల వారీగా పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి ప్రవీణ్ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గత ఏడాది డిశంబర్ 26వ తేదీ నుంచి జనవరి 11 వరకు నిర్వహించిన సమ్మె సందర్భంగా జరిగిన చర్చల్లో యూనియన్ల నేతలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఓ కాపీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 17 రోజుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పండుగ సెలవులు, ఆదివారం సెలవులు మంజూరు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామన్న హామీ మేరకు

సింగ్‌నగర్‌లో నిరసన

జీఓ రూపంలో తక్షణమే విడుదల చేయాలని లేనట్లయితే మరో సారి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి డి స్టీఫెన్‌బాబు, నాయకులు టి తిరుపతమ్మ, శీలందాసు, దుర్గా, కృష్ణవేణి, ఎం బుజ్జమ్మ పాల్గొన్నారు.

పెండ్యాలలో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి-కంచికచర్ల: మండలంలోని పెండ్యాలలో మంగళవారం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ

పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బషీర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ పెన్షన్ సేవింగ్స్ స్కీం ప్రారంభం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఐసిఐసిఐ ప్రూ గోల్డ్ పెన్షన్ సేవింగ్స్‌ను ప్రారంభించినట్లు కంపెనీ మేనేజర్ కె ఎస్ ఆర్ ప్రసాద్ బాబు తెలిపారు. ఇది పన్ను ప్రయోజనాలను అందించే పెన్షన్ ఉత్పత్తి, కస్టమర్‌లు క్రమబద్ధమైన రీతిలో పొదుపు చేయటానికి, ఆర్థికంగా స్వతంత్ర రిటైర్డ్ జీవితాన్ని గడపడానికి కావలసిన రిటైర్‌మెంట్ కార్పస్‌ను రూపొందించడానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు. వినియోగదారులు పెట్టిన పెట్టుబడికి భద్రత అందించటమే కాకుండా కాంప్లిమెంటరీ హెల్త్ చెకప్‌లు, పాక్షిక ఉపసంహరణలను సైతం అందిస్తున్న భారతదేశపు మొట్టమొదటి ప్రొడక్ట్ అన్నారు. తమ లిక్విడిటీ అవసరాలకనుగుణంగా మూడు సంవత్సరాల వ్యవధి తర్వాత కస్టమర్‌లు చేసిన పెట్టుబడిలో 25 శాతం వరకు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు.

బీమా జ్యూయలర్స్ వాలెంటైన్ కలెక్షన్ విడుదల

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: వాలెంటైన్స్ డే వేడుకలు సందర్భంగా భీమా జ్యువెలర్స్ వర్చ్యూ వాలెంటైన్ కలెక్షన్‌ను విడుదల చేసినట్లు షోరూం మేనేజర్ కె.ఎం. కె.ప్రసాద్ తెలిపారు. ఎం. జీ రోడ్డు లోని షోరూం నందు ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రేమ యొక్క స్ఫూర్తిని వేడుకగా జరుపుకునే అద్భుతమైన 18 కేరట్ బంగారు, వజ్రాల ఆభరణాల శ్రేణి ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. ఈ కలెక్షన్ లో గొలుసులు, ఉంగరాలు, కంకణాలు, చెవి రింగులు వున్నాయి. అన్నారు .హృదయపూర్వక భావోద్వేగాల లోతును ప్రతిబింబించే హస్తకళ, మనోభావాలను ప్రతిబింబించేలా ప్రతి ఆభరణం రూపొందించబడింది అని తెలిపారు.. రూ.13 వేల నుంచి 78 వేల వరకు శ్రేణిలో లభించే 'వర్చ్యూ వాలెంటైన్' కలెక్షన్ ప్రేమ, ప్రశంసల సారాంశాన్ని కలిగి ఉందని తెలిపారు.

36 మందికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ: ఐదో ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 36 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత ఆరవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో మంగళవారం ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి జి.లెనిన్‌బాబు నలుగురు వ్యక్తులకు ఒకొక్కరికి రూ.15 వేలు చొప్పున, మిగిలిన 32 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

టిప్పర్ ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-మైలవరం: జి.కొండూరు మండలంలోని కుంటముక్కల గ్రామం సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వలస కార్మికుడు విశ్వామిత్ర (18)అనే వ్యక్తి అక్కడికక్కడే మతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం మతిచెందిన వ్యక్తి ఇటుక బట్టిలో పనిచేసేందుకు ఒరిస్సా నుండి తన తల్లి దండ్రులతో కొంతకాలం క్రితం ఇక్కడికి వలస వచ్చారు. మంగళవారం రాత్రి బట్టి లో పనులు ముగించుకుని సమీపంలోని చిల్లర దుకాణం వద్దకు వెళుతుండగా మైలవరం నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మతుని తల పూర్తిగా చిద్రమైంది. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్ లో తరలిస్తుండగా అందుకు నిరాకరించిన కుటుంబ సభ్యులు, సహచర కూలీలు పోలీసులతో కొద్దిసేపు వాగ్వివాదానికి దిగారు.జి. కొండూరు ఎస్సై వారికి నచ్చజెప్పి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాబీర్ అహ్మద్ దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పథకాలు, అన్నీ రకాల పౌర సేవలను పల్లె ముంగిటకే

సచివాలయ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఉదయభాను

తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించమని రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని తొట చర్ల గ్రామంలో మంగళవారం.40 లక్షలతో నిర్మించనున్న సచివాలయంను ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చేందుకే ప్రతి గ్రామంలో సచివాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్‌ఆర్ ఆసరా ద్వారా తోట చర్ల గ్రామానికి 2 కోట్ల 20 లక్షల రూపాయల నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ప్రజాశక్తి-వత్సవాయి: ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, ఇష్టంతో చదవాలని ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో మహాత్మా జ్యోతిరావు ఫూలే వెనకబడిన గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొగ్గవరపు వెంకట రాజారావు, సతీమణి రమాదేవిలను సత్కరించారు.

మహిళపై దాడి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని సీతారాంపురంలో మహిళపై గొడ్డలితో దాడి చేసిన కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు జగ్గయ్యపేట సిఐ జానకిరామ్ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం విలేకరులు సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. తన మొదటి భర్తతో మనస్పర్థలు వచ్చిన కారణంగా విడిపోయి ఓబుల్ రెడ్డిని సత్యశ్రీ రెండో వివాహం చేసుకుని జగ్గయ్యపేటలో సంగం పాల డైరీ నడుపుతుంది. ఐదు సంవత్సరాల క్రితం పని నిమిత్తం సత్య శ్రీ ఇంటికి వచ్చిన వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన సయ్యద్ జాన్ సైదా కొంతకాలంగా తన కోరిక తీర్చమని వేధించడంతో భర్త ఓబుల్‌రెడ్డికి విషయం చెప్పింది. దీనితో ఓబుల్‌రెడ్డి సైదాని పిలిచి మందలించడంతో సైదా కక్ష పెంచుకున్నాడు. తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదనే ఉద్దేశంతో సత్యశ్రీ ఇంటికి వెళ్లి గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన సత్యశ్రీని పోలీసులు విజయవాడ ఆసుపత్రికి తరలించారు. సత్య శ్రీ కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ రోడ్‌షో ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్, ఎబ్లూ శ్రేణి ఎలక్ట్రిక్ 2, 3 వీలర్ల తయారీదారులు, విజయవాడలోని తమ డీలర్‌షిప్‌ను విస్తరిస్తూ తమ పాన్ ఇండియా రోడ్‌షోను కొనసాగిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హైదర్ ఖాన్ తెలిపారు. నగరంలోని సంస్డీ డీ లర్‌షిప్ బిఎస్ ఈ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో మంగళ వారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరీ ఎలక్ట్రిక్ మోటార్స్ యొక్క అత్యాధునిక ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించడానికి రోడ్‌షో నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్‌షో మంగళవారం నుండి గురువారం వరకు విజయవాడలోని పంట కాలవ రోడ్డు జవహర్ ఆటో నగర్‌లోని బిఎస్‌సి స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డీలర్‌షిప్‌లో జరుగుతుందన్నారు.

కిడ్నీ బాధితురాలికి చేయూత

ప్రజాశక్తి-మైలవరం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మైలవరంకు చెందిన మాదల గీతకు స్థానిక మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిస్తోంది. కిడ్నీలు పాడై ఇబ్బందికర పరిస్థితిలో ఉన్న గీతకు మూడు నెలల నుండి అవసరమైన సరుకులు, మందులు, ఫ్రూట్స్ అందిస్తున్నామని ట్రస్ట్ గౌరవాధ్యక్షురాలు శ్రీ పద్మ తెలిపారు. మంగళవారం గీతకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షురాలు కోయసుధ, డి విజయలక్ష్మి, మాధవి, కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.

16న 150 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 150 అడుగుల జాతీయ జెండాను ఈ నెల 16వ తేదీ ఉదయం పది గంటలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆవిష్కరించబోతున్నామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చిల్లకల్లు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ అధికారిని లక్ష్మీ భార్గవి మంగళవారం తెలిపారు. గుమ్మడిదుర్రు ఎస్‌సి, జగ్గయ్యపేట అర్బన్ ఒసి జనరల్ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. స్థానికులైన వివాహితులు 1.07.2023 నాటికి 21 సంవత్సరాలు నిండి ఉండాలని, కనీస విద్యార్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు సంబంధిత పత్రాలతో శిశు అభివృద్ధి పథకం ప్రాజెక్టు అధికారి, సమగ్ర శిశు అభివద్ధి సేవా పథకం, ఐసిడిఎస్ ప్రాజెక్ట్, రామన్నపేట రోడ్డు, నందిగామ వారికి వ్యక్తిగతంగా రెండు సెట్లు అందజేయాలని, ప్రతి సర్టిఫికెట్‌పై గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టేషన్ చేయించాలని తెలిపారు.

విస్సన్నపేట ఆస్పత్రిలో అదనపు భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విస్సన్నపేట

విస్సన్నపేట మండలం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో

అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపి నాని

రూ.5.07 కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని ఎంపి కేసినేని నాని ప్రారంభించారు. అనంతరం భవనంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ నల్లగట్ల స్వామిదాస్, నల్లగట్ల సుధారాణి, కేడీసీసీ డైరెక్టర్ భూక్యరాణి, మాజీ ఏఎంసి డైరెక్టర్ మద్ది రెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎఎంసి డైరెక్టర్ నాగనర్సిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొండపర్వ గ్రామంలో నూతనంగా 45 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎంపి ప్రారంభించారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
బుధవారం 14 ఫిబ్రవరి 2024

ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఆదేశించారు. తోట్లవల్లూరు మండలంలో ఇసుక రీచ్‌లను కలెక్టర్ పి. రాజాబాబు మంగళవారం మధ్యాహ్నం జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు గనులు, కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. కృష్ణానదిలో ఇసుక తవ్వకాలపై గుంటూరు జిల్లాకు చెందిన దండా నాగేంద్ర అనే వ్యక్తి ఎన్జీటీకి ఫిర్యాదు చేయటంతో తవ్వకాలు ఆపాలని జాతీయ హరిత గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలో వాస్తవాలు పరిశీలించాలని ఎన్జీటీ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఈ సందర్భంగా కలెక్టర్ నదిలో మన ప్రాంతానికి 3 పాయింట్లకు సంబంధించి ఫోటోలు, వాస్తవ నివేదికను సిద్ధం చేసి వెంటనే పంపించాలని గనులు, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఏ ఎస్పీ అడ్మిన్ జి. వెంకటేశ్వరరావు, గనుల శాఖ రాయల్టీ ఇన్స్పెక్టర్ శివపార్వతి టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, సర్వేయర్ రామలక్ష్మి , డిప్యూటీ తహశీల్దార్లు ధనలక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వెళ్లిన వెంటనే రొయ్యూరులో ఇసుక తవ్వకాలు

మండలంలో కలెక్టర్ పి.రాజాబాబు ఇసుక తవ్వకాలు పరిశీలించడానికి వచ్చినంత సేపు రొయ్యూరు ఇసుక క్వారీలో తవ్వకాలు నిలుపుదల చేశారు. కలెక్టర్ మండలం దాటి వెళ్లడంలోనే రొయ్యూరు క్వారీ నుంచి తవ్వకాలు ప్రారంభించారు. తోట్లవల్లూరు ఇసుక రీచ్‌ని పరిశీలించడానికి వచ్చిన కలెక్టర్ అధికారులను రొయ్యూరు ఇసుక క్వారీని తాసిల్దారు నిలుపుదల చేశారని తమ దృష్టిలో ఉందని ఇప్పుడు నడుస్తుందా అని ఆరా తీశారు. దీంతో అధికారులు రొయ్యూరు క్వారీకి పర్మిషన్ లేదని తెలిపారు. ఇదిలా ఉండగా కలెక్టర్ బందం మండలం దాటటంతోనే రొయ్యూరు క్వారీలో తవ్వకాలకు తెరలేపారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగాయి.

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

వెళ్లిన వెంటనే ఇసుక లోడుతో వెళ్తున్న వాహనాలు

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడిన వారవుతారని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి పిలుపునిచ్చారు. మంగళవారం కృష్ణా విశ్వవిద్యాలయ ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్, రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి ప్రారంభించారు.ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ కృష్ణా విశ్వవిద్యాలయం లో నిరంతరం రక్త దాన కార్యక్రమాలు నిర్వహించటం చాలా గర్వంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏ ఇతర విశ్వవిద్యాలయాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు తాను చూడలేదన్నారు. ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు రక్త దానం పై అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ముందుకు వచ్చేలా చూడాలి అని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో 40 యూనిట్ల రక్తంను సేకరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి, రెడ్ క్రాస్ కార్యదర్శి శంకర్ నాథ్, కోశాధికారి బాలాజీ, అసోసియేట్ ఎన్ సి సి అధికారి డా రామశేకర్ రెడ్డి, రెడ్ క్రాస్ వైద్యులు డా హనుమంతయ్య, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లపట్టాల అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ప్రవేశపెట్టిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. వైయస్సార్ ఇళ్ల పట్టాలు మండలంలో 2251 మంది లబ్ధిదారులకు అందజేశారు. మండలం లోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్లు 84 శాతం చేసినట్లు ఎంపీడీవో దారపు శ్రీనివాస్ తెలిపారు. కవుతరం గ్రామ సచివాలయం పరిధిలో 90 శాతం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కనక దుర్గ, పంచాయతీ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆటోడ్రైవర్ల వినతి

ప్రజాశక్తి - గుడివాడ : పట్టణంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ది గుడివాడ ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు అంగడాల సతీష్ పేర్కొన్నారు. మంగళవారం ది గుడివాడ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అడపా గరగారావుని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా అంగడాల మాట్లాడుతూ ఆటోలపై పోలీసుల లేనిపోని ఆంక్షలు విధించడం వల్ల డ్రైవర్ల జీవానికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ప్రత్యేకంగా ప్రతి చిన్న విషయానికి కేసులు నమోదు చేయకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్, బస్టాండ్, మార్కెట్ సెంటర్, ఏలూరురోడ్ ఆటో యూనియన్ నాయకులు వంగలపాటి బాలస్వామి, కోటేశ్వరరావు, రామమోహన్, జాన్‌బాబు, బెంజిమెన్, శ్యాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐను కలసిన ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు

19 నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రెండవ అన్నవరంగా పేరుగాంచిన స్థానిక సంత రోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి 71 వ బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీ నుండి 24 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు. 19వ తేదీ సోమవారం 10 గంటలకు స్వామివారిని పెళ్లి కుమారుని చేయుట, సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణము కార్యక్ర మంలో పొట్లూరి సత్యనారాయణ, జ్యోతి దంపతులు పాల్గొంటారన్నారు. 20వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారి సామూహిక వ్రతములు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. 21వ తేదీ స్వామివారి రాయబార మహోత్సవం, 22వ తేదీ తిరు కల్యాణో త్సవం, 23వ తేదీ స్వామి వారి గరుడోత్సవము, 24వ తేదీ స్వామివారి పవళింపు సేవ జరుగుతాయన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యతో పాటు ఆటలు, వివిధ రకాల కళా రూపాలు పిల్లలకు ఎంతో అవసరం అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు మంగళవారం మండల కేంద్రం పరిధిలో గల శ్రీ జయ రామ విజ్ఞాన విహార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 17వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో బాలవర్ధనరావు మాట్లాడుతూ చదువు జ్ఞానం పెంచుతుందని ఆటలు, కళారూపాలు మానసిక ఉల్లాసాన్ని,ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. రాబోవు కాలంలో విద్యలో వచ్చే మార్పులు గమనిస్తూ వాటిని అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. లోకేష్ ఇండస్ట్రీ సిఇఓ బాయన లోకేష్, ఎన్ఏసీఇఆర్‌టి సోషల్ టెక్స్ట్ బుక్ రచయిత కొల్లా దశరథరావు, కాట్రగడ్డ సుధారాణి, విద్యా భారతి ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ ఓంకార్ నరసింహారావు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ఉత్సవాలు ఆకట్టుకున్నాయి.

కుట్టుమిషన్లు అందజేత

ప్రజాశక్తి-కోదూరు : కోడూరులోని ఒకటో వార్డులో గల పాస్టర్ కరుణ కుమారు ఇంటి వద్ద హస్త కళా సేవా కేంద్రం విజయవాడ, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో, ఏపీఐటిసిఓ హైదరాబాద్ వారిచే 30 మందికి ఇంప్రూవ్డ్ టూల్ కిట్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కోడూరు మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుభాషిని, విజయవాడకు చెందిన హస్తకళలు అభివృద్ధి అధికారి ఎం.సువర్చల పాల్గొన్నారు. పిడి సుధీర్ కుమార్, కోట అరుణ , కోట కరుణ కుమార్, పాల్గొన్నారు.

25న 'అడుగుదాం ఆంధ్రా' బహిరంగ సభ : టిడిపి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దగా పడిన ప్రతి యువత మేలుకో అంటూ తెలుగు యువత ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25 న ఉయ్యూరులో జరిగే భారీ బహిరంగ సభ ను జయప్రదం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు,జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరిలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో కొనకళ్ల నారాయణ రావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో అబద్ధపు వాగ్దానాలతో రాష్ట్రంలోని యువత ఓట్లను కొల్లగొట్టిన జగన్. తాను అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇస్తానని ఇవ్వకుండా యువతను మోసం చేశారన్నారు, యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్ర ప్రదేశ్ గా మార్చారన్నారు. తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో దగా పడిన ప్రతి యువతను మేలుకొలుపుతూ ఫిబ్రవరి 25వ తారీఖున ఉయ్యూరు జంక్షన్లో యువత కోసం యువత భవిష్యత్తు కోసం కృష్ణాజిల్లా తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరుగనున్నదని అన్నారు. దీనిని విజయవంతం చేయాలన్నారు. అనంతరం అడుగుదాం ఆంధ్రా సభ పోస్టర్ ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య),రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు హసీంమ్ బేగ్,జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు మండవ అన్వేష్,జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్, తెలుగు యువత అధికార ప్రతినిధి ఖలీల్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

భూహక్కు చట్టం రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి కలెక్టరేట్ (కృష్ణా) : నూతన భూ హక్కు చట్టంపై పాలకుల మొండివైఖరి విడనాడాలని మచిలీపట్నం న్యాయ వాదుల సంఘం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, తుంగల హరిబాబు, కొట్టి రఘురాం లు పేర్కొన్నారు.వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మచిలీపట్నంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం ఎదుట మంగళవారం న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన భూ హక్కు చట్టం ద్వారా ప్రజలకు జరిగే అన్యాయాన్ని పాలకులకు వినతి పత్రాల రూపంలో ఇచ్చిన కూడా పాలకులు స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. సదరు చట్టం రాక మునుపు పేద, మధ్యతరగతి ప్రజలు వారి భూమి మీద హక్కు పొందాలంటే సివిల్ కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందే వారిని, ఇప్పుడు ఈ చట్టం వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు సివిల్ కోర్టు ద్వారా న్యాయం పొందే వీలుండదని ప్రజలు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, డి పోతురాజు, కొండయ్య, జీ జె విక్టర్, నెహ్రూ, ఓఎస్ కే శివకుమార్, సూర్య ప్రకాష్ రావు, భగత్, యు శ్రీనివాస్, తోట రామకృష్ణ, సాక్షి శశి శ్రీ, సాయి పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడిని సత్కరిస్తున్న దృశ్యం

బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం

ప్రజాశక్తి - గుడివాడ : ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్, ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి బాడీ బిల్డింగ్ అండ్ ఫిజికల్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ - 2024 పోటీల్లో, 70 కిలోల శరీర బరువు విభాగంలో పాల్గొన్న గుడివాడ ఫిట్ జోన్ బిల్డర్ ఎస్ దిలీప్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్రం సర్టిఫికెట్ అందుకున్నట్లు కోచ్ మహ్మద్ సైదా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏలూరు రోడ్డులోని ఫిట్ జోన్ కార్యాలయంలో క్రీడాకారుడు దిలీప్, కోచ్ మహమ్మద్ సైదాను డాక్టర్ సెల్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, వైసిపి కృష్ణాజిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవిలు ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో జిమ్ సభ్యుల పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి పోరాటం : జెఏసి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉద్యమం కొనసాగుతుందని జేఏసీ నాయకులు వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 14న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని చెప్పారు. 15,16 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయం లో నిరసనల్లో పాల్గొంటామన్నారు. 17న ర్యాలీ లు, 20న కలెక్టర్ ఆఫీస్‌ల ముందు నిరసనలు తెలియజేస్తామన్నారు. 27న చలో విజయవాడ చేపడతామని, నిన్న జరిగిన చర్చలు కేవలం ఛాయ్ పే చర్చ అన్నట్టు సాగాయన్నారు. ఇప్పటి వరకూ 11 సమావేశాలు జరిగాయి కానీ ఒక్క అడుగు కూడా ప్రభుత్వం ముందడుగు వేయడం లేదన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీ జెఏసి తాలుకా కన్వీనర్ సాంబశివరావు, యుటిఎఫ్ నాయకులు యం.వరప్రసాద్, జెఏసి కోఛైర్మన్ శివప్రసాద్, జి.రాజాబాబు, జి.రవిబాబు, యం.చలపతిరావు ఎస్‌టియు ఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చందర్లపాడు: మండల కేంద్రమైన చందర్లపాడులో ఈ నెల 16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచకుండా మోసం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి ఏడుకొండలు, ఎస్ లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ హుస్సేన్, షక్ ఉద్దండ్ సాహెబ్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తోట రామారావు, రైతు సంఘం నాయకులు నల్లాని శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** వత్సవాయిలో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం చంద్రశేఖర్ , కౌలు రైతు సంఘం నాయకులు సిహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కారు చౌకగా బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము, నాయకులు కె.కొండయ్య తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి ఐఓసిఐఎల్ గ్యాస్ ప్లాంట్ మేనేజర్ రామారావుని మర్యాద పూర్వకంగా సమ్మె జయప్రదం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్, ఐఓసిఐఎల్ గ్యాస్ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు సెక్రటరీ శేషాగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు బోసుబొమ్మ ఆటో స్టాండ్ సెంటర్‌లో కరపత్రాలను ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, పర్వతం శ్రీనివాసరావు, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో మోడల్ కాలనీ, గండ్రాయి రోడ్, బీసీ కాలనీ, ఎర్రగడ్డ ప్రాంతాలలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, వెంకట్రావు, మరికంటి, భారతి, చల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామలో సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్, నందిగామ టాక్సీ యూనియన్ సభ్యులు కొమ్ము పండు, మన్నెం హనుమంతరావు, కస్తాల శేషగిరిరావు, ఎర్రగొర్ల మోహన్‌రావు, రాయపాటి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఓసిఐఎల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

చందర్లపాడులో కరపత్రాల ఆవిష్కరణ

కొండ ప్రాంతాల్లో పెట్రోలింగ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: వన్‌టౌన్‌లోని శ్రీనివాస మహల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సిఐ గణేష్, సిబ్బంది మంగళవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కొండ ప్రాంతాలల్లో తిరుగుతూ సిఐ గణేష్ జల్లెడ పట్టారు. కొండ పైన నివశిస్తున్న స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఉంటే పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు ఎవరైనా సంచరిస్తుంటే తమకు తెలియజేయాలని కోరారు. అలాగే అక్రమ మద్యం అమ్మకాలు సాగించే వారి గుట్టు రట్టు చేయాలని, ఆకతాయిల ఆడగాలు సాగించే వారి వివరాలు తమకు తెలియజేయాలని స్థానికులను కోరారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-విసన్నపేట: విస్సన్నపేట గ్రామ మాజీ సర్పంచి లక్ష్మయ్య ఎంపి నాని సమక్షంలో మంగళవారం వైసిపిలో చేరారు. ఆయనతో మరో 20 కుటుంబాలకు చెందిన వారికి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు వైసిపి ఇన్చార్జి నల్లగట్ల స్వామి దాస్, సుధారాణి, పిల్లి వనజాక్షి రాజేష్, గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగ మల్లేశ్వరి, మాజీ ఏఎంసి చైర్మన్ మద్ది రెడ్డి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని విశ్వ భారతి డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ప్రతి ఒక్కరికి లైసెన్స్ తప్పనిసరని అదేవిధంగా ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఆర్‌సి ఫోర్స్ లో ఉండాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, యువత వాహనాన్ని నడిపేటప్పుడు మితిమీరిన వేగంతో వెళ్లకూడదని, కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, కొల్లా నాగరమేష్, జిల్లా తిరుపతిరావు, జూటూరి వెంకటేశ్వర్లు (అబ్బులు), వివిఎల్ నారాయణరావు పాల్గొన్నారు.

మైలవరం నుంచి పోటీకి సిద్ధం : సాంబశివరావు

ప్రజాశక్తి-మైలవరం: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో మైలవరం ఎమ్మెల్యే సీటును గౌడ సామాజిక వర్గానికి కేటాయించాలని ప్రముఖ న్యాయవాది పజ్జూరి వెంకట సాంబశివరావు వైసిపి అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మైలవరం కోర్టులో న్యాయవాదిగా 20 సంవత్సరాలుగా పని చేస్తున్నానని, కాంగ్రెస్ పార్టీకి అటు తరువాత వచ్చిన వైసిపికి తాను సేవలుఅందించానని చెప్పారు. నియోజకవర్గంలో 30 వేల పైచిలుకు గౌడ సామాజిక వర్గ ఓటర్లు ఉన్నారనిచ సీఎం జగన్ ఎస్సీ, ఎస్టి, బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి తన పేరును పరిగణలో తీసుకోవాలని సీఎం జగన్ కు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో శరత్ బాబు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతనకొండ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేతనకొండ మరియు మండల పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కు మండల కో- ఆప్షన్ సభ్యులు పఠాన్ నాగుల్ మీరా వినతిపత్రం అందజేశారు. మంగళవారం మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కేతనకొండ గ్రామంలో సమస్యల పరిష్కారం గురించి మాట్లాడారు. వివిధ సమస్యలను ఆయనకు వివరించారు. ముఖ్యంగా మంచినీటి సమస్య మరియు జగనన్న ఇళ్ల పట్టాలపై లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యలపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని లబ్ధిదారులందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు తన వంతు కషి చేస్తానని హామీ ఇచ్చారు.

రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ అభివద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివని ప్రభుత విప్ సామినేని ఉదయభాను తెలిపారు. జాతీయ రహదారి వద్దనున్న పరాసబంక డొంకను మూడు కిలోమీటర్ల దూరంలోని పోచంపల్లి గ్రామానికి కలుపుతూ నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం, రూ.40 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో మంగళవారం ఉదయభానుతో కలిసి రాష్ట్ర ముదిరాజ్ యువసేన అధ్యక్షులు గూడూరు నాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు బూతుకురి మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లులో ఆరోగ్య సురక్ష

రాష్ట్రవ్యాప్తంగా స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విజుయవంతంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు చిల్లకల్లు 1 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ప్రతి క్యాంపులో 14 రకాల వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


పోచంపల్లిలో రోడ్డును ప్రారంభిస్తున్న ఉదయభాను

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి-తిరువూరు

రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేం దుకు ఓటర్లకు ఇబ్బంది కలగకుండా పోలింగ్ బూతుల వద్ద ఏ విధమైన ఆటంకాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) మురళీమోహన్ తెలిపారు. మంగళవారం తిరు వూరులోని పోలింగ్ బూత్‌లను అయన మంగళవారం ఎస్ఐ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు. తిరువూరు, మైలవరం నియోజకవ ర్గాల్లో సమస్యాతకమైన గ్రామాలను కూడా గుర్తిస్తున్నా మన్నారు. అల్లర్లకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని బలుసుపాడు క్రాస్ రోడ్ వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. వెనకనుండి గుర్తు తెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తెలంగాణ రాష్ట్రం, కోదాడ మండలం, ద్వారకుంట గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడికి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడను 108 అంబులెన్స్ ద్వారా జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలిలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జెఇఇ మెయిన్స్‌లో శ్రీ శ్రీనివాస గ్రావిటీ విద్యార్థుల ప్రతిభ

శ్రీ శ్రీనివాస గ్రావిటీ యాజమాన్యం, విద్యార్థులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: జఇఇ మెయిన్స్ 2024 మొదటి సెషన్ ఫలితాలలో నగరంలోని శ్రీ శ్రీనివాస గ్రావిటీ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ పరుచూరి శ్రీనివాస్ తెలిపారు. మొగల్ రాజ పురంలోని కళాశాల కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి అన్నే భరత్ 99.7, శివరామ కష్ణ99.3, కె.నూతన శ్రీ 97.5 అత్యధిక పర్సంటైల్ సాధించారని తెలిపారు.అలాగే 20 మందికి పైగా 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతి ఏటా జె ఈ ఈ మెయిన్స్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. పూర్తి స్థాయి అనుభవం గల అధ్యాపకుల కషి వల్లనే మంచి ఫలితాలు సదిస్తున్నమని తెలిపారు.అలాగే తల్లిదండ్రుల సహకారం కూడా వుందని అన్నారు. ఈ సమావేశంలో కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ సతీష్, ఫిజిక్స్ లెక్చరర్ సురేష్ బాబు, ప్రిన్సిపాల్ పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.భవాని అన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానాన్ని తీసుకురావడం పట్ల మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఎస్‌సి ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు డి.ప్రకాష్, కోశాధికారి కట్టా రవిబాబు, కార్యదర్శులు ఎం.చంద్రు తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లిందని, ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం మెగా డీఎస్సీ అంటూ ఆశలు చూపి, అధికారంలోకి వచ్చిన ఇంత కాలానికి అతి తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం, అప్రెంటిస్ వ్యవస్థను మరల ప్రవేశ పెట్టడం విడ్డూరంగా ఉందని యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య అన్నారు. మంగళవారం యూటీఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్యర్యంలో పట్టణంలోని టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జె.సుదానంద్, జి.పల్లవి, ఎల్వి.సత్యనారాయణ, టి.జయసుధ, అల్లిక నరసింహారావు, కే.సాయి శ్రీనివాసరావు, వి.వి.సుబ్బారావు, ఎం.దేవదానం, పి.పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో...

జగ్గయ్యపేటలో...

16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయండి



గన్నవరంలో...

మచిలీపట్నంలో..

ఉయ్యూరులో మాట్లాడుతున్న చౌటపల్లి రవి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా,రైతు ,కార్మిక ,ఉద్యోగ, రవాణా రంగ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16 దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెలో రవాణా రంగ కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయ రావు పిలుపు నిచ్చారు. సమ్మెకు సంబంధించి మంగళవారం నగరంలో కరపత్రాల పంపిణీ చేసి సమ్మె విజయవంతంపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా జయరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టంలో డ్రైవర్లకు రెండు లక్షల జరిమాన, పది సంవత్సరాలు వరకు జైలు జీవితంఅనే నిబంధన జత చేయడం వల్ల డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఉరితాడు లాంటి మోటార్ వెహికల్ చట్టం సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని, రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఈనెల 16న దేశవ్యాప్త జరిగే సమ్మె ,నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.**ప్రజాశక్తి-గన్నవరం :** కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వ ధోరణులకు నిరసనగా జరిగే ఆందోళనలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు వందలాదిగా పాల్గొనాలని పలు ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఐలు నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర వైసిపి ప్రభుత్వ కార్మిక, ఉద్యోగి వ్యతిరేక విధానాలను కూడా సహించబోమని ఎలుగెత్తి చాటాలన్నారు. నిరసన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులను ప్రజలను భాగస్వాములు చేసి ప్రభుత్వ వైఖరిని ఎండ కట్టాలన్నారు. పోరాటాలు చేయకుండా సమస్యలు పరిష్కారం అయ్యే పరిస్థితి దేశంలో లేదన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కామల ఉమా మహేశ్వరరావు, టిఎన్టి.యు.సి రాష్ట్ర నాయకులు దొంతు చిన్నా, ఏపీ రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, ఏఐటియుసి నాయకులు కాట్రగడ్డ జోషి, టిఎన్.టి.యు.సి నాయకులు బి. నాగ ప్రసాద్, మోటార్ వర్కర్స్ యూనియన్ నూతక్కి మోహన్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుఎం. ఆంజనేయులు, ఐద్వా నాయకులు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-చల్లపల్లి :** ఈనెల 16న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రామిక గుంటూరు బాపనయ్య భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బిజెపిప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు కార్యకర్తలు పోరాడాలని సూచిం చారు. ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ సంస్థల పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకమైన కుట్రలు చేస్తుందని విమర్శించారు. తొలుతగా కరపత్రాలను ఆవిష్కరించారు. మహమ్మద్ కరీముల్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు వెనిగళ్ళ వసంతరావు, సిహెచ్ గంగాభవాని, ముంతాజ్ బేగం, దేవు రాజ్యలక్ష్మి, మేడేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక అంజనేయపపేటలోని సుందరయ్య భవనంలో వామపక్షాల నాయకులు సమ్మెకు సంబంధించిన పోస్టర్లను వామపక్ష పార్టీల నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైతాంగానికి రైతు వ్యతిరేక చట్టాలు సంవత్సరం పాటు చేసినప్పుడు చట్టాలు వెనక్కి తీసుకుని చట్టం చేస్తానని హామీ ఇచ్చారని, అవి ఏమీ అమలు అవ్వకుండా కాల యాపన చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు నీలం మురళీకష్ణారెడ్డి, రేపాని కొండ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కార్మికుల ఆందోళన గ్రామీణ నిరసనను జయప్రదం చేయాలని కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రఘు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అవుటుపల్లి రవి, వ్యవసాయ కార్మిక సంఘం చల్లపల్లి మండల కార్యదర్శి వై మధు, సిఐటియు మండల కార్యదర్శి కరిముల్లా, మోపిదేవి వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బండి ఆదిశేషు, కోడూరు మండలం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పోలబత్తిన మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు ఎంఎస్పి (మినిమం సపోర్ట్ ప్రైస్) చెల్లిస్తామన్న హామీని బిజెపి ప్రభుత్వం నిలబట్టుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు చౌట పల్లి రవి అన్నారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర మొత్తం ఉత్పత్తి ఖర్చులు మరియు కుటుంబ శ్రమ విలువ పైన 60 శాతం ఉండేలా చట్టబద్ధత కల్పించాలని, కేరళ తరహా రుణవిమోచన చట్టం తీసుకురావాలని, అన్ని బ్యాంకింగ్ సంస్థల నుండి ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు కే శివ నాగేంద్ర పంచకర్ల రంగారావు జిల్లా అధ్యక్షుడు సేలం ప్రకాష్ రావు బేతా శ్రీనివాసరావు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) (రైతు – వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య వేదిక) సిఐటియు, ఏపి రైతు సంఘం, ఏపి కౌలు రైతు సంఘం, ఏపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

గుడివాడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కోడూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్. రఘు తదితరులు

వైసిపి విజయానికి కృషి

● దుట్టా రామలక్ష్మీ

దుట్టా సీతా రామలక్ష్మి

ప్రజాశక్తి - ఉంగుటూరు : దుట్టా అనుచరులంతా రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని ఉంగుటూరు జెడ్పిటిసి దుట్టా సీతా రామలక్ష్మి అన్నారు. మంగళవారం సీతా రామ లక్ష్మి మీడియాతో మాట్లా డుతూ నిజమైన దుట్టా అనుచరులు ఎవ రూ పార్టీ మారబోరని, రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ని మళ్ళా ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తారని చేస్తామని అన్నారు. అనేకమంది పలు రకాలుగా దుట్టా వర్గీయులంతా పార్టీ మారుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది సరైనది కాదని అన్నారు. దుట్టా రామచంద్ర రావు కి ఆయన కుటుంబానికి వైసిపి తో విడదీయరాని బంధం ఉందని, ఆ బంధాన్ని ఎప్పటికీ కొనసాగిస్తామని అన్నారు. అవకాశవాదులు అవకాశ వాదంగా మాట్లాడుతూ తన తండ్రి రామచంద్రరావుపై అసంబద్ధమైన మాటలు మాట్లాడుతూ డబ్బుకు అమ్ముడుపోయామని ప్యాకేజీలు తీసుకున్నామని రకరకాల మోసపూరిత మాటలతో వైసీపీ కార్యకర్తలను గందరగోళ పరిచే విధంగా వారి మాటలు కనబరుస్తున్నారని, ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. రాజకీయాలు అవకాశవాదంగా కాకుండా ప్రజలు అవసరాలు తీర్చేదిగా ఉంటేనే ఏ నాయకుడైనా మనగలుగుతారని అలా ప్రజల అవసరాలు తెలుసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన నాయకుడిగా జగన్మోహన్ రెడ్డి ఎదిగారని అన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు యంత్రం అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జపాన్‌కి చెందిన బహుళ జాతీయ ఇంజన్ తయారీ సంస్థ ఇసుజు వారు గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కు రూ.93,000 రూపాయలు విలువ గల ఫోర్ స్ట్రోక్ కట్ సెక్షన్ యంత్రం పాలిటెక్నిక్ మెకానికల్ విభాగంలో ల్యాబ్ నిర్వహించడం కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఇసుజు కంపెనీ ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ వారి టీంతో స్వయంగా వచ్చి పాలిటెక్నిక్ మేనేజ్మెంట్‌కి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మిట్టల్ విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మూడు విషయాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. విద్యార్థులు ఒక లక్ష్యం కోసం చదువుకోవాలని ఏ పరిస్థితులను లక్ష్యాన్ని విడవరాదని, ఏ విషయానికి విచారించరాదని, ఎప్పుడు నూతన ఉత్తేజంతో ప్రయత్నిస్తూనే ఉండాలని, శారీరకంగా మానసికంగా ప్రతి విద్యార్థి తనను తాను కొత్తగా నిర్మించుకోవాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఇసుజు ఇంటర్నల్ కంట్రోలర్ మేనేజర్ సివిల్ కుమార్ శుక్ల, టెక్నో అఫైర్స్ అండ్ పబ్లిక్ రిలేషన్ మేనేజర్ పి.మురళి, డిప్యూటీ మేనేజర్ హెచ్.ఆర్.ఎస్ నరేష్, యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ వల్లూరు పల్లి నాగేశ్వరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరు పల్లి సత్యనారాయణ రావు, ఎగ్జిక్యూటివ్ మెంటార్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలంలోని ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపు 5 వ రోజులో భాగంగా నారయ్య అప్పారావుపేట గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు పలు రకాల సూచనలు చేశారు. అపరిచితులకు బ్యాంకు ఖాతాల వివరాలను తెలియ పరచకూడదని, ఫోన్‌కి వచ్చే సమాచారాలను ఇతరులకు చూపించకూడదని, వేలు ముద్ర ద్వారా లాక్ అండ్ అన్లాక్ పద్ధతిని అలవర్చుకోవాలని సూచించారు.గ్రామ పంచా యతీ సర్పంచ్ ఎన్ నాగరాజు, ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీహరిబాబు పాల్గొన్నారు

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీ పట్నం మండలం తాళ్లపాలెం పంచాయతీ రాయిపల్లికు చెంది మోదుమూడి ఏడుకొండలు ఈ నెల 11వ తేదీన మృతిచెందాడు. ఆయన కానూరు సంఘంలో లోన్ తీసుకుని వ్యాపార లావాదేవీలు నిర్వహించడం వలన సంఘం నుండి కేడీసీసీ బ్యాంక్ సౌజన్యంతో పదివేల రూపాయలు మట్టి ఖర్చుల నిమిత్తం ఆయన భార్య మోదుమూడి కుమారికి వైసిపి నాయకులు పేర్ని కష్ణమూర్తి (కిట్టు) మంగళవారం అందజేశారు. కానూరు సంఘ అధ్యక్షులు, శ్రీకాకుళం నాగేశ్వరరావు (బాబు) డైరెక్టర్ పీత వడ్డీ కాసులు, పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం తాళ్లపాలెం1, 2 సచివాలయం పరిధిలో లో రైతుభరోసా కేంద్రాలను మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి పేర్ని కష్ణమూర్తి (కిట్టు)ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని డి హారిక, తాళ్లపాలెం పంచాయతీ సర్పంచ్ మదిరి అశ్విని,మండల కన్వీనర్ వాలిశెట్టి రవి శంకర్ , కష్ణాజిల్లా రైతు విభాగం అధ్యక్షులు శ్రీకాకుళం నాగేశ్వరరావు (బాబు)వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పెదపారుపూడి : రాష్ట్రం పురోగతి సాధించాలంటే చంద్రబాబు నాయుడు వంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎంతో అవసరం ఉందని పామర్రు నియోజక వర్గ ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని దోసపాడు గ్రామంలో కుమార్ రాజా నాయకత్వాన్ని బలపరుస్తూ 50 కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి కుమార్ రాజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, గుండపనేని శ్రీనివాసరావు, సజ్జ శివకుమార్, జి రవికుమార్, కార్యదర్శి మసిముక్కు రాంబాబు, జనసేన మండల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల నూతన తహసిల్దారుగా విధులలో చేరిన ఎం. సునీల్ కుమార్ ను అవనిగడ్డ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పార్టీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి గాజుల జయ గోపాల్ సత్కరించారు. మంగళవారం తాసిల్దారును కలసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినం దించారు.

అంగన్వాడీ సిబ్బంది పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మినీ అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని, అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిశు సేవ అభివద్ధి పథక అధికారి జి.మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. మినీ అంగన్వాడీ కార్యకర్తలకు సంబంధించి గొల్లపూడి-16 (గొల్లపూడి గ్రామం/బీసీ-ఏ)బీ అంగన్వాడీ సహాయకురాలుకు సంబంధించి ఎనికేపాడు (ఎనికేపాడు గ్రామం/బీసీ-డీ), గుణదల-4 (2వ డివిజన్, ఓసీ), ద్వారకానగర్-1 (17వ డివిజన్, ఓసీ), తారకరామా నగర్ (18వ డివిజన్, ఓసీ) ఖాళీ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరిస్తునట్లు సిడిపిఒ టి. నాగమణి తెలిపారు. విజయవాడ అర్బన్ పరిధిలోని 45వ డివిజన్ న్యూ జోజి నగర్-3లో ఒసి కేటగిరీలో, 63వ డివిజన్ రాజీవ్ నగర్ -7లో ఒసి-ఆర్థికంగా బలహీన వర్గం కేటగిరిలో, 63వ డివిజన్ రాజీవ్ నగర్ వడ్డెర కాలనీలో ఒసి కేటగిరిలో, 59వ డివిజన్ లూనా సెంటర్-2లో ఒసి కేటగిరిలో అంగన్వాడి సహాయకుల పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె తెలిపారు. అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు 2023 జూలై 1వ తేదీనాటికి 21 సంవత్సరాలు నిండి ఉండి, 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొందిన స్థానికంగా వివాహిత రాలై ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల అంగన్వాడి కార్యకర్తలు, ఆయా పోస్టులకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థునులు కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డులను గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలకు రెండు ఫొటోలు జతచేసి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కానూరులోని సిడిపిఒ విజయవాడ అర్బన్ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలని సిడిపిఒలు జి.మంగమ్మ, టి.నాగమణి కోరారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మంగళవారం జక్కంపూడిలోని టిడ్కో గహాలను పరిశీలించారు. అక్కడ ఉన్న ఇంజినీర్లను అడిగి మోడల్ హౌసెస్ ప్లానింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు త్వరలో టిడ్కో గహాలను అందుబాటులోకి తీసుకురావాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం లేకుండా నిర్మించాలని అన్నారు. ఈపర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే.వీ. సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు

మధ్యతరగతి ఉద్యోగుల మద్దతు

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌కు, పారిశ్రామిక సమ్మెకు మధ్యతరగతి ఉద్యోగుల వేదిక తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఆ రోజున జరిగే ఆందోళనల్లో తాము పాలుపంచుకుంటామని ప్రకటించింది. గాంధీనగర్‌లోని ఎన్‌జిఒ హోంలో మంగళవారం మధ్యతరగతి ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. 16న అన్ని రంగాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని, నగర వ్యాప్తంగా పాత బస్టాండ్ నుండి జరిగే కార్మిక కర్షక ప్రదర్శనలో పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వ విధానాల దుష్ప్రభావాలను ప్రజల్లో ప్రచారం చేసి మద్దతు కోరాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలతో దేశ ప్రజలపై భారాలు పెరిగాయని చెప్పారు. రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసినా వారికి ఇచ్చిన హామీలను ఇప్పటిదాకా అమలు చేయలేదని వివరించారు. కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన లేబర్ కోడ్‌ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం వత్తిడి తెస్తోందన్నారు. ప్రభుత్వ రంగాల ప్రైవేటీకరణను వేగవంతం చేయడమే కాకుండా లీజుకు ఇచ్చే విధానాన్ని కూడా తెచ్చిందన్నారు. నిత్యాసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రజావసరాలకు అవసరమైన రంగాల్లో బడ్జెట్ కేటాయింపులు తగ్గించడమే దీనికి ప్రధాన కారణమన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చి, కార్మికులను, కర్షకులను ప్రభుత్వం దోచుకుంటోందన్నారు. వేదిక రాష్ట్ర కన్వీనర్ ఆర్.అజయ్ కుమార్ సమన్వయం చేసిన ఈసమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్, ఎపి ఎన్జీవో అసోసియేషన్ పశ్చిమ కష్ణా అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, బిఎస్ ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎల్.బాలాజీ, ఎల్ఐసి ఉద్యోగ సంఘం నాయకులు సిహెచ్.కళాధర్, బ్యాంకు ఉద్యోగ సంఘం నాయకులు ఎస్‌వి.రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షులు ఎం.వి.సుధాకర్, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఎస్‌కె జిలాని, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎల్.రాజు, ఆల్ పెన్షనర్స్ నాయకులు టి.ప్రభుదాస్, రైల్వే పెన్షనర్స్ నాయకులు సుందరరామ రాజు, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎం.వి. ఆంజనేయులు, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ నాయకులు చంద్రశేఖర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు టి.గజలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

నేటి నుండి ఆకాశవాణిలో వేంపల్లె షరీఫ్ కథలు ప్రసారం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ రేడియో కేంద్రం వారు ప్రముఖ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్ రాసిన కథలను బుధవారం నుంచి ప్రసారం చేయనున్నారు. ఈనెల 14, 15, 17, 21, 22, 24, 28, 29, మార్చి 2 తేదీల్లో ఉదయం 7.15 నుంచి 7.45 గంటల మధ్యలో ప్రసారం ఈ కథలు ప్రసారమవుతాయి. ఆసక్తి ఉన్నవారు సెల్ ఫోన్లో ఆకాశవాణి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని కూడా కథలు వినవచ్చు.

ప్రకటన
మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

E.P NO. 22 /2023 IN OS 287 / 2018

Between:-
Chaparala Raja Rao ....D.H.R
And
Potluri sitha and 2 others ... JDRs
To
R2. Tatineni Padmaja, W/o. Srinivasa Rao, Hindu, aged 39 years, housewife, R/o. D.no. 9/385, Sai Surya Apartment, Oppo. H.P. Call Gas, Gudivada, Krishna District
R3. Potluri Sudha rani, D/o. Late veera venkata Jagan Mohan Rao, Hindu, aged about 36 years, Private Employee, working as Office Assistant, Gowtham Concept School, Bypass Road, Gudivada, Krishna District

పై నెంబరు ఇ.పి.లో 2 మరియు 3వ రెస్పాండెంట్స్ అయిన మీకు Order 21 Rule 64 నోటీసులు అమలు నిమిత్తం పై కోర్టువారు ది. 01-03-2024 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, లేదా మీ వకీలు ద్వారా గానీ హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల మీ పరోక్షమందు మీకు వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 01-03-2024

కె.వి.రామకృష్ణారెడ్డి,
అడ్వకేట్, గుడివాడ.
సెల్ : 9490881180

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE AT: VUYYURU
O.S..No.130 of 2023

Between:
కెనరా బ్యాంకు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా,
ఆంధ్ర ప్రదేశ్ -521165 ...Plaintiff
AND
వెంకట శేషగిరి రావు తూములూరి □ Defendant
To
వెంకట శేషగిరి రావు తూములూరి, S/o శ్రీ రామశర్మ D.No.2-38, శివాలయం వీధి, ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ -521165

పైన పేర్కొనబడిన కెనరా బ్యాంకు ఉయ్యూరు వారు మీకు వ్యతిరేకముగా Rs.5,64,588-21 (Rs. ఐదు లక్షల అరవయ్యి నాలుగు వేల, ఐదువందల ఎనభయి ఎనిమిది రూపాయల ఇరవయ్యి ఒక్క పైసలు) మరియు వడ్డీతో సహా బాకీ వసులు కొరకు పైన పేర్కొన బడిన ఉయ్యూరు కోర్ట్‌లో, పైన పేర్కొన బడిన దావా O.S.No.130/2023 వేసినారు. కావున మీరు తారీకు 13-3-2024 న పైన పేర్కొనబడిన కోర్టునకు ఉదయము 10:30 A.M, గంటలకు మీరు వ్యక్తిగతముగా గాని లేదా మీ ప్లీడరు ద్వారా గాని హాజరు కావలయును. లేని యెడల మీ పరోక్షములో పైన పేర్కొన బడిన దావా విచారించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేదీ: 13-3-2024

ఇట్లు
కే.ఫణికుమార్, అడ్వకేట్,
సాయి సత్యదేవనగర్, నెప్పల్లి, కంకిపాడు మండలం,
కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 521245
తేది:13-2-2024 ఫోన్ : 9441407470

మహారాజశ్రీ కృష్ణాజిల్లా, మచిలీపట్నం
మొదటి అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

GWOP No. 90/2023
(మైనర్లు అయిన కొణతం గ్రీష్మంత్ 13 సం॥లు మరియు కొణతం శ్రీమంత్ 11 సం॥లు సంబంధించిన విషయం)

బిట్వీన్
కొణతం శ్రీనివాసరావు ...పిటీషనర్
మరియు
కొణతం వెంకట రాజ్యలక్ష్మి ... రెస్పాండెంట్
భర్త : కొణతం శ్రీనివాసరావు, తండ్రి : బొర్రా మురళీ మోహనరావు (లేటు), డోర్ నెం. 26/322-2, బుట్టాయిపేట, మచిలీపట్నం.

పై నెంబరు GWOP No. 90/2023 ను పిటీషనర్ మైనరు పిల్లలు అయిన గ్రీష్మంత్ మరియు శ్రీమంత్‌లకు పిటీషనర్ గార్డియన్‌గా నియమించుటకు దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనా సదరు పరిహారంపై ఎట్టి అభ్యంతరాలు అయిన ఉన్న యెడల ది. 06-03-2024న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరయి మీరుగాని, మీ వకీలు గారి ద్వారా గానీ తెలియజేసుకొన వలెను. లేనియెడల ఎవరికి ఎట్టి ఆక్షేపణలు లేవని తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదాతేది :06-03-2024

ఎం.పి.కొండయ్య,
పిటీషనరు తరపు న్యాయవాది,
తేది : 12-2-2024 మచిలీపట్నం.

మొదటిపేజీ తరువాయి

యువకులే బ్రాండ్ అంబాసిడర్లు

శాతం నమోదైందని ఈ నేపథ్యంలో విజయవాడ అర్బన్‌లో 84 శాతానికి పైగా పోలింగ్ శాతం పెంచేందుకు వినూత్న స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో యువ ఓటర్ల నమోదుకు విద్యా సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినట్లు తెలిపారు. ఓటు, పోలింగ్ స్టేషన్ వివరాలను తెలుసుకునేందుకు వీలుగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్)లు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ డిల్లీరావు వెల్లడించారు. అన్ని వర్గాల వారూ ప్రజాస్వామ్య స్ఫూర్తితో బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకునేలా సమ్మిళిత ఎన్నికల నిర్వహణ దిశగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా ఓటు పొందిన యువతకు ఉపయోగపడేలా కలెక్టర్ డిల్లీరావు స్వయంగా ఈవీఎంకు సంబంధించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడే సి-విజిల్‌తో పాటు ఓటర్ హెల్ప్ లైన్ తదితర ఆన్‌లైన్ వేదికలు, ఫారం-6, 7, 8ల ప్రయోజనం గురించి తెలియజేశారు. కొత్తగా ఓటు నమోదుకు వీలుకల్పించే ఫారం-6లను అధికారులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు గారి ప్రత్యేక కషి కారణంగా అర్హులైన యువ ఓటర్లను ఓటు నమోదు చేసుకునేలా పెద్దఎత్తున ప్రోత్సహించడం జరిగిందని.. ఇది మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునే విధానంపైనా ఈవీఎంలతో అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో తక్కువ పోలింగ్ శాతం నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి ఓటు హక్కు ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు దేవినేని మధుసూదనరావు.. మనం ఓటు వేద్దాం.. మన భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం అంటూ అవగాహన కల్పించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎస్వీ రవీంద్రనాథ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి ఉద్యమబాట

వివరించారు. ఈనెల21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు అన్ని జిల్లాల్లో పర్యటించి 27న చేపట్టే 'చలో విజయవాడ'కు ఉద్యోగులను సన్నద్ధం చేస్తారని తెలిపారు. మీడియా సమావేశంలో జెఎసి జిల్లా కన్వీనర్ ఎండి ఇక్బాల్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖాసిం, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.కె ఇమ్రాన్ సాహెబ్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దాలి నాయుడు, విష్ణువర్ధన్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎ.సాంబశివరావు, ఐటిఐ ఉద్యోగుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిషోర్ బాబు, గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు శశిధర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సతీష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బివి.రమణ, నగర శాఖ కార్యదర్శి సంపత్ కుమార్, మధుసూదనరావు మహిళా కార్యదర్శి కె .శివలీల, ఎపి జెఎసిలోని వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

18న వాంబేకాలనీలో దీక్షలు

పాలనలోనూ, సిపిఎం నేతలు కార్పొరేటర్‌గా ఉన్న సమయంలోనూ అజిత్‌సింగ్ నగర్ నుండి కండ్రిక వరకు నామమాత్రపు ధరలకే పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఇళ్లు, పట్టాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న జరిగే నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర, సభల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నేతలు కె.దుర్గారావు, పీర్ సాహెబ్, ఓంకార్, రంగస్వామి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE AT: VUYYURU
O.S..No.133 of 2023

Between:
కెనరా బ్యాంకు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా,
ఆంధ్ర ప్రదేశ్ -521165 ...Plaintiff
AND
1. మట్టా శోభనాద్రి
2. చిగురుపాటి శ్రీనివాస్ చక్రవర్తి □Defendants
To
1. మట్టా శోభనాద్రి S/o. తిరుపతయ్య , D.No.1-4, హరిజనవాడ, ఉయ్యూరు, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ -521165
2. చిగురుపాటి శ్రీనివాస్ చక్రవర్తి , S/o. కృష్ణాజీ రావు D.No.3-39, పెనమకూరు , తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ -521165

పైన పేర్కొనబడిన కెనరా బ్యాంకు ఉయ్యూరు వారు మీకు వ్యతిరేకముగా Rs.4,74,039-97 (రు. నాలుగు లక్షల, డెభైనాలుగు వేల, ముప్పై తొమ్మిది రూపాయల తొంభైయేడు పైసలు), మరియు వడ్డీతో సహా బాకీ వసులు కొరకు పైన పేర్కొన బడిన ఉయ్యూరు కోర్ట్‌లో, పైన పేర్కొన బడిన దావా O.S.No.133/2023 వేసినారు.కావున మీరు తారీకు 13-3-2024 న పైన పేర్కొనబడిన కోర్టునకు ఉదయము. 10:30 A.M, గంటలకు మీరు వ్యక్తిగతముగా గాని లేదా మీ ప్లీడరు ద్వారా గని హాజరు కావలయును. లేని యెడల మీ పరోక్షములో పైన పేర్కొన బడిన దావా విచారించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేదీ: 13-3-2024

ఇట్లు
కే.ఫణికుమార్, అడ్వకేట్,
సాయి సత్యదేవనగర్, నెప్పల్లి, కంకిపాడు మండలం,
కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 521245
తేది:13-2-2024 ఫోన్ : 9441407470

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE AT: VUYYURU
O.S..No.132 of 2023

Between:
కెనరా బ్యాంకు, ఉయ్యూరు, కృష్ణాజిల్లా,
ఆంధ్ర ప్రదేశ్ -521165 ...Plaintiff
AND
1. ప్రియభానుశ్రీ మేడికొండ
2.మేడికొండ శివరామకృష్ణ ప్రసాద్ □Defendants
To
1. ప్రియభానుశ్రీ మేడికొండ, W/o. ఎం.ఎస్.ఆర్.కె ప్రసాద్, D.No.4-121, నవోదయ స్కూల్‌రోడ్, గండిగుంట, ఉయ్యూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ -5211165
2. మేడికొండ శివరామకృష్ణ ప్రసాద్ , S/o వీరభద్ర రావు, D.NO.4-121, నవోదయ స్కూల్ రోడ్ , గండిగుంట, ఉయ్యూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ -5211165

పైన పేర్కొనబడిన కెనరా బ్యాంకు ఉయ్యూరు వారు మీకు వ్యతిరేకముగా Rs.1,96,442-05/- (ఒక లక్ష తొంభైఆరు వేల, నాలుగు వందల నలభై రెండు రూపాయల ఐదు పైసలు), మరియు వడ్డీతో సహా బాకీ వసులు కొరకు పైన పేర్కొన బడిన ఉయ్యూరు కోర్టులో, పైన పేర్కొన బడిన దావా O.S.No.132/2023 వేసినారు. కావున మీరు తారీకు 13-3-2024 న పైన పేర్కొనబడిన కోర్టునకు ఉదయము. 10:30 A.M , గంటలకు మీరు వ్యక్తిగతముగా గని లేదా మీ ప్లీడరు ద్వారాగాని హాజరు కావలయును. లేనియెడల మీ పరోక్షములో పైన పేర్కొన బడిన దావా విచారించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)
వాయిదా తేదీ: 13-3-2024

ఇట్లు
కే.ఫణికుమార్, అడ్వకేట్,
సాయి సత్యదేవనగర్, నెప్పల్లి, కంకిపాడు మండలం,
కృష్ణాజిల్లా, ఆంధ్ర ప్రదేశ్ - 521245
తేది:13-2-2024 ఫోన్ : 9441407470

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత

ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ

బాధితులకు సాయం చేస్తున్న మాదివాడ వెంకటకృష్ణ

సాయం చేస్తున్న టిడిపి నాయకులు మండలి వెంకట్రామ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని వస్మట్ల గ్రామంలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు పొనుగు మాటి వీరరాఘవులు, పొనుగుమాటి ఏడుకొండలకు చెందిన గహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ఆ ఇల్లు పూర్తిగా దగ్ధమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు మంగళవారం ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి వారికి రూ పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం ద్వారా అందవలసిన సహాయాన్ని అందే విధంగా గహాల నిర్మాణానికి నూతన గహాల మంజూరుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, ఎంపిటిసి సభ్యులు మండలం ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా అగ్ని ప్రమాద బాధితులకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ పదివేల ఆర్థిక సహాయం తో పాటు 50 కేజీల బియ్యం అందజేశారు. టిడిపి జిల్లా ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు మేడికొండ విజయ్, గుడివాక నరహరి, బండే రాఘవ పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు కూడా బాధితులను పరామర్శించి రూ పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు, సోదరుడు రాంబాబు గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చి రెండు కుటుంబాలకు రూ 12 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే అవనిగడ్డ నియోజకవర్గం జనసేన నాయకులు, అక్షయ డెవలపర్స్ అధినేత మాదివాడ వెంకటకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి రూ పదివేల ఆర్థిక సాయం అందజేశారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను పాల్గొన్నారు.

గన్నవరం పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం డిఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ అద్నాన్ నయామ్ ఆస్మి మంగళవారం పరిశీలించారు. గన్నవరం డివిజన్లోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ ఉన్న కేసుల వివరాల గురించి వాకబు చేశారు. అనంతరం గన్నవరం సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి జయసూర్య పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకానికి రాతపరీక్షలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపికల కొరకు రాత పరీక్షలు నిర్వహించారు. మంగళవారం విశ్వవిద్యాలయ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం ఆధ్వర్యములో విజయవాడ చైతన్య విద్యాసంస్థల వారిచే నిర్వహించిన ఈ రాత పరీక్షల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణితం, ఆంగ్లం, బోటనీ, జువాలజీ, రసాయన శాస్త్రం, ఎంసిఏ విభాగాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. చైతన్య విద్యాసంస్థల్లో అధ్యాపకుల ఎంపిక ప్రక్రియ కోసం ఈ ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం జరిగిందని విశ్వవిద్యాలయ ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ విభాగం సమన్వయకర్త జి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థలు అకాడమిక్ సమన్వయకర్తలు ఎం అశోక్ కుమార్, ఏ చక్రధర్ ప్రసాద్, పి భాను కష్ణ, మచిలీపట్నం చైతన్య కాలేజీ ప్రిన్సిపల్ ఆర్ వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గన్నవరంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహనా కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ అవగాహనా కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ యస్ జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తుతో జీవితం శూన్యం అని, మత్తు పదార్థాల జోలికి వెళ్ళద్దు అని అన్నారు. తెలిసో తెలియక మాదకద్రవ్యాలకు అలవాటు చేసుకుంటున్నారు అని, మత్తు పధార్థాలతో బ్రతుకు దుర్భరం చేసుకోవద్దు అని, ఎటువంటి మత్తు పధార్థాలు తీసుకున్నా అవి ప్రాణాంతకమే అన్నారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి విజయరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర భవానీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు.

పలుచోట్ల 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడివాడ టిడిపి ఇంచార్జ్ వెనిగండ్ల రాము డోకిపర్రు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాము ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని టిడిపి జనసేన మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించారు. టిడిపి పార్టీ మండల అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి,మాజీమంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర్ రావు , గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ సాయిన పుష్పావతి పాల్గొన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన పి మోహన్ రావుకు ఇస్త్రీ బండి నివెనిగండ్ల రాము పంపిణీ చేశారు. **ప్రజాశక్తి గూడూరు** : గూడూరు మండలం కోక నారాయణ పాలెం, ఆకుమర్రు, గ్రామాల లో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పెడన నియోజకవర్గం ఇన్చార్జి కాగిత కష్ణ ప్రసాద్ పాల్గొని గ్రామంలో ఇంటింటికి తిరిగి భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోతన స్వామి,జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాసరి ఉమా సాయిరాం, నియోజవర్గ టిడిపి పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్** : మచిలీపట్నం మండలం పోలాటి తిప్ప గ్రామంలో సర్పంచ్ మోకా రాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ పథకాల పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో కొల్లు నీలిమ మాట్లాడుతూ మత్స్యకారుడికి జగన్ ప్రభుత్వంలో కలిగిన లబ్ది శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలాటి తిప్ప సర్పంచ్ మోకారాజు, మాజీ జెడ్పిటిసి లంకే నారాయణ ప్రసాదు క్లస్టర్ ఇంచార్జ్ వక్కపట్ల శ్రీను, గ్రామ పార్టీ అధ్యక్షుడు మోకా నాగ నిర్మల రావు, యూనిట్ ఇంచార్జ ఒడుగు పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో ఉప్పాల రాము పర్యటన

ప్రజాశక్తి గూడూరు : గూడూరు మండలం గూడూరు గ్రామ పంచాయతీలో మంగళవారం వైయస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రమేష్ (రాము) గడప గడపకు మన ప్రభుత్వం, ప్రజా దీవెన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాము గడపగడపను సందర్శిస్తూ జగనన్న ప్రభుత్వం ప్రజలకు అందించిన లబ్ధిని గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండలం పరిషత్ అధ్యక్షులు సంగ మధుసూదనరావు, జెడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు,స్టేట్ ఫైనాన్స్ డైరెక్టర్ గూడూరు పీఏసీఎస్ అధ్యక్షులు కారుమంచి కామేశ్వరరావు, గొరిపర్తి వరలక్ష్మి రవికుమార్, సర్పంచ్ లింగం సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత 'ఆరోగ్య సురక్ష' ప్రారంభం

ప్రజాశక్తి ఘంటసాల : ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు జడ్పిటిసి సభ్యులు తుమ్మల మురళీకష్ణ తెలిపారు. మంగళవారం ఘంటసాల మండల పరిధిలోని కొడాలి జడ్పీ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పిటిసి సభ్యులు మాట్లాడుతూ, సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఆకాంక్షతో గ్రామీణ ప్రాంతాల్లో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యుల చేత పరీక్షలు నిర్వహించి, మందులు అందిస్తున్నారని, ప్రజలు ఈ వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషమాంబ, ఇన్చార్జి ఈవోపిఆర్డి బి.అర్జునరావు, పంచాయతీ కార్యదర్శి సిహెచ్వి ఎస్.నాగమణి, చల్లపల్లి సిఐ నాగప్రసాద్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, కొత్తపల్లి పీఏసిఎస్ చైర్మెన్ తాతినేని వెంకట కష్ణారావు పాల్గొన్నారు.

చెరువు పూడ్చివేతపై ఆందోళన

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామపంచాయతీకి చెందిన రజకుల సొసైటీ ఆధ్వర్యంలో ఉన్న చెరువు అక్రమంగా పూడ్చి వేస్తున్నారంటూ రజక సంఘం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఏ విధమైన అనుమతులు లేకుండా రాత్రి సమయాలలో చెరువును పూర్తి వేస్తున్నారంటూ ఆందోళన చేపట్టారు. రజక సంక్షేమ సేవా సంఘం సొసైటీ పేరుతో రజకులు ప్రతి సంవత్సరము 31 ఎకరాలకు పైగా భూమికి లీజు చెల్లిస్తున్నారు. క్రమేపి ప్రతి సంవత్సరము చెరువును అనుమతులు లేకుండా అక్రమంగా పూడ్చి వేస్తున్నారని రజకులు ఎన్నో పర్యాయాలు మండల, జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన ఏ ఒక్కరు పట్టించుకున్న దాఖలాలు లేవంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

నాగపడగ బహూకరణ

ప్రజాశక్తి- మోపిదేవి : గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి మచిలీపట్నం వాస్తవ్యులు కె.రామకష్ణ సుబ్రహ్మణ్యేశ్వర రావు వెండి నాగ పడగనూ మంగళవారం అందించారు. దేవస్థానం సూపరిండెంట్ బొప్పన సత్యనారాయణ, ప్రధాన అర్చకులు దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

క్యాంపు కార్యాలయ నిర్మాణంలోనూ

'సిసి'ల చేతివాటం..?

- వివిధ శాఖల నుంచి లక్షలాది రూపాయలు వసూలు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ద్వితీయ స్థాయి జిల్లా ఉన్నతాధికారి నివాసం పక్కన నిర్మిస్తున్న క్యాప్ కార్యాలయంలోనూ సీసీలు తమ చేతివాటం ప్రదర్శించి భారీగా వసూలు చేశారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినబడుతున్నాయి. గతంలో ఇక్కడ పని చేసిన అధికారి తమ వద్ద నున్న 'కాలా' నిధులతో నివాసం పక్కన నూతన క్యాంపు కార్యాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ 50 లక్షల అంచనా వ్యయంతో ఈ నూతన క్యాంపు కార్యాలయం నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. ఇంకేముంది ఈ అవకాశాన్ని వదులు కోకూడదు అనుకుని తమకున్న అధికారాన్ని ఉప యోగించి అ అధికారికి తెలియకుండా అ అధికారి పేరు ఉపయోగించి నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంట్, ఇసుక, బుసక, పర్నిచర్ తదితర వస్తువులన్నీ ఉచితంగా వచ్చేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధి కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాలు కనుక ఎవరు మరో ఆలోచన చేయకుండా వారు ఆదేశాల మేరకు వారు అడిగినవన్నీ పంపించినట్లు ఆ శాఖ ఉద్యోగులే మాట్లాడుకుంటున్నారు. అలాగే వీటితో పాటు ఆ అధికారికి అనుబంధంగా ఉన్న శాఖలు , అలాగే కొంత మంది వ్యక్తుల వద్ద నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు గుసగుసలు వినబడుతున్నాయి. నగదు వసులల్లో కూడా తమ చాకచక్యం ఉపయోగించారని, వారు రెగ్యులర్ గా ఉపయోగించే ఫోన్ నంబర్ల కాకుండా తమ వ్యక్తిగత ఫోన్ నంబర్లు ఇచ్చి కొంత నగదును ఫోన్ పే,గూగుల్ పే ,చేయించు కున్నట్లు తెలుస్తోంది. ఓ పక్క క్యాంప్ కార్యాలయ నిర్మాణానికి అధికారికంగా నిధులు మంజూరుకు బిల్లులు పెడుతూనే ఉన్నతాధికారి తెలియకుండా జిల్లాలోని పలు మండలాల నుండి ఈ విధంగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు కార్యాలయాల్లో ఉద్యోగులే మాట్లాడుకోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో ఓ పెట్రోల్ బంక్ ను అనివార్య కారణాల వల్ల అధికారుల ఆదేశాల తో సిజ్ చేశారు. తిరిగి అ బంక్ ప్రారంభించడానికి బంక్ యజమాని చేయని ప్రయత్నం లేదు. చివరికి ఆయన ఫైల్ ముందుకు వెళ్లేందుకు కింద స్థాయిలో సిబ్బందికి సర్దుకుంటూ చివరకు జిల్లా ద్వితీయ స్థాయి ఉన్నతాధికారి వద్దకు తీసుకువచ్చారు. దీంతో ఇంకేముంది సిసిలు ఆ వ్యక్తికి నూతనంగా నిర్మించిన క్యాంప్ కార్యాలయంలో 25 ఖరీదైన కుర్చీలకు ఇండెంట్ పురమాయించారని, అయితే ఆ వ్యక్తి ఇందుకు ససేమిరా అన్నాట్లు తెలుస్తోంది. అడిగిన డబ్బులు ముట్ట చెప్పి మళ్లీ ఇవన్నీ సమకూర్చాలంటే తన వల్ల కాదని చెప్పినట్లు సమాచారం.

ఒకే బిల్లుకు రెండు సార్లు నిధులు విడుదల చేయించుకుంటున్న వైనం ..!

జిల్లా ఉన్నతాధికారులు కార్యాలయంలో పరిపాలన సౌలభ్యం కోసం అవసరమైన వాటికి ఖర్చు నిధులు ట్రెజరీ శాఖతో సంబధం లేకుండా కలక్టరేట్ లో కొన్ని సెక్షన్‌ల నుండి నేరుగా విడుదల చేయించుకునే అవకాశం ఉంది. ఇంకేముంది ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకుని చేసిన ఖర్చుల సంబంధించిన బిల్లులు ఒక సెక్షన్ కు తెలియకుండా మరో సెక్షన్ లో ఇలా ఒకే బిల్లు నిధులను రెండు సెక్షన్ లలో మంజూరు చేయించుకుంటున్నట్లు కార్యాలయ ఉద్యోగులే గుసగుస లాడుతున్నారు. ఇలా ప్రతి విషయంలో వారి చేతివాటం ప్రదర్శిస్తున్న వీరి అవినీతి ఆరోపణలపై పూర్తి స్థాయిలో ఉన్నతాధికారులు దష్టి సారించి లోతుగా విచారణ జరిపిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని కార్యాలయ ఉద్యోగులు ప్రజలు, కోరుతున్నారు.

చిరువ్యాపారుల పొట్టకొట్టొద్దు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

చిరువ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : మోడీ, జగన్ ప్రభుత్వాలు చిల్లర వర్తకంలో కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ చిరు వ్యాపారుల పొట్టగొడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. అదానీ, బడా కార్పొరేట్లకు రుణమాఫీలు చేస్తున్న బ్యాంకులు...వీధి వ్యాపారులకు మొండి చేయి చూపుతున్నాయని విమర్శించారు. చిరు వ్యాపారులు వేధిస్తున్న పాలకులు కనీసం వారికి గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు కూడా ఇవ్వటం లేదన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో మంగళవారం వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. చిరు వ్యాపారం రక్షించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వీధి వ్యాపారులకు హక్కులకోసం పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఆన్లైన్ వ్యాపారం పేరుతో చిన్న, మధ్య తరగతి వ్యాపారులను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. బడా కంపెనీలకు ప్రయోజనం కల్పిస్తూ చిరు వ్యాపారులను సర్వనాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీతో కుమ్మక్కవుతున్న టిడిపి, వైసిపిలకు పేదల ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. పేదలకు, చిరు వ్యాపారులకు అండగా నిలిచేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో చట్టసభల్లో ప్రవేశించేందుకు కమ్యూనిస్టులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నేతలు బి రమణరావు, కే దుర్గారావు, వై సుబ్బారావు, లక్ష్మణ, భూలోకం, టి శ్రీనివాస్, శంకర్, జమున పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను పనిలోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-వన్‌టౌన్: సెంట్రల్ లేబర్ అధికారి ఆదేశాల ప్రకారం వెంటనే విజయవాడ రైల్వే స్టేషన్‌లోని కాంట్రాక్ట్ కార్మికులను పనిలో నియమించాలని డిమాండ్ చేస్తూ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డిఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో రైల్వే కాంటాక్ట్ కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్ నరసింహులు మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా పనుల నుండి తొలగింపబడిన కాంట్రాక్ట్ కార్మికులు గత ఏడు నెలలుగా పని కల్పించాలని పోరాడుతుంటే, రక్షక్, పద్మావతి సంస్థల కాంట్రాక్టర్లు, రైల్వే అధికారులు తీవ్రమైన నిర్లక్ష్యం వహించటాన్ని తప్పుపట్టారు. యూనియన్ నగర కార్యదర్శి ఈ.వి. నారాయణ మాట్లాడుతూ కార్మిక పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, అధికారుల నిర్లక్ష్యాన్ని పై అధికారులకు ఫిర్యాదుచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాదె ఆదిలక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

39వ డివిజన్‌లో ఆసిఫ్ ప్రచారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గ 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర అధ్వర్యంలో నిర్వహించిన

కార్యక్రమంలో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మంగళవారం పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఎండి ఇర్ఫాన్, పడిగపాటి చైతన్య రెడ్డి, ఏలూరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'బెజవాడ రాజారావు' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-భవానీపురం: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు ప్రోగ్రాం పోటీలో విద్యాధరపురం అరవింద స్ట్రీట్‌లో గల బెజవాడ రాజారావు హైస్కూల్ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు ప్రోగ్రాం పోటీల్లో రాష్ట్రం నుండి 3,448 ప్రాజెక్టులలో ఎన్‌టిఆర్ జిల్లా నుండి మొత్తం 143 ప్రాజెక్ట్‌ను ఎన్నిక చేశారు. అందులో తమ పాఠశాల బెజవాడ రాజారావు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు 'రైలు ప్రమాదాల నివారణ' అనే ప్రాజెక్టును ఈనెల 12వ తేదీన ఆంధ్ర లయోల కాలేజీ వేదికగా జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుని పదవ తరగతి విద్యార్థులు రంగాల హరిప్రియ, ధరావతు లిఖిత్ సాయి కిరణ్, సైన్స్ టీచర్ తంబళ్ళ అశోక్ కుమార్ సహకారంతో తయారు చేసి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించినట్లు తెలిపారు.

కృష్ణా వర్సిటీ హ్యాండ్‌బాల్ విజేత కెబిఎన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ (పురుషుల) ఛాంపియన్‌గా కేబీఎన్ కళాశాల విజయం సాధించింది. కష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ (పురుషుల) కేబీఎన్ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఆ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా జరిగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. నూజివీడు డీఏఆర్ కళాశాల ద్వితీయ స్థానంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల తతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఏసిపి అశోక్‌కుమార్ గౌడ్ మట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు కావాలన్నారు. తద్వారా మంచి ఆరోగ్యంతో పాటుగా అనేక అవకాశాలను పొందుతారని వివరించారు. తాను కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థిగా క్రీడల్లో రాణించి అనేక బహుమతులను పొందినట్లు వివరించారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగాధిపతి డాక్టర్ జేఎన్ లావణ్యలత మాట్లాడుతూ విశ్వవిద్యాలయం క్రీడలను ప్రోత్సాహిస్తుందన్నారు. కార్యక్రమాన్ని కళాశాల క్రీడా విభాగాధిపతి డీ హేమచంద్రరావు నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన క్రీడా విభాగ అధ్యాపకులు మన్నే స్వామి, బాయన రాములు తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావుకు అవార్డు

ప్రజాశక్తి-భవానీపురం: అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న పశ్చిమ నియోజకవర్గం భవానీపురంకు చెందిన ఎపి పి.టి.డి బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ శేషగిరిరావును గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో సోమవారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రజా డైరీ మాసపత్రిక 24వ వార్షికోత్సవ సందర్భంగా ఎడిటర్ సురేష్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవ చేస్తున్న వారికి ఇచ్చే సెలబ్రిటీ అవార్డుల్లో భాగంగా శేషగిరిరావుకు సినీ హిరీలో సుమన్, భానుచందర్‌ల చేతుల మీదుగా అవార్డు అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురం పరిధిలోని గాంధీ బొమ్మ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు పాటు భవానీపురంలోని బ్యాంకు సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్డు, గాంధీ బొమ్మ రోడ్, చర్చ్ రోడ్, కోళ్ల ఫారం రోడ్, డాల్ఫిన్ బార్ రోడ్ మరియు ఆర్.టి.సి వర్క్ షాప్ రోడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తెలుగుయువత ప్రచారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక 43వ డివిజన్‌లోని ఐరన్‌యార్డులో పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు ఆర్.మాధవ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి షాప్‌నకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో మాధవ మాట్లాడుతు ఐరన్ యార్డ్ లో ముఠా కార్మికుల,పలు సమస్యలను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి గాలికి వదిలేసారని విమర్శించారు. ఇక్కడ ఎటువంటి వసతులు లేక ముఠాకార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మరుగుదొడ్లు లేకపోవడంతో పాటుగా ముఖ్యంగా మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు ఎం.రాంబాబు, గూడెల మహేష్, కాటంరాజు, పైడిపాటి సాయి, ఆకుల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పంచమి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ పంచమిని పురస్కరించుకొని శ్రీ దుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం ఈ నెల 14వ తేదీ బుధవారం పెద్ద సంఖ్యలో విచ్చేయనున్న విద్యార్థులు, యాత్రికుల సౌకర్యార్థం విజయవాడ నగర పశ్చిమ ఏసిపి పి.మురళీకష్ణారెడ్డి, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ కెవిఎస్ఆర్ కోటేశ్వరరావు మరియు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ ద్వారంపూడి దుర్గా శేఖర్ రెడ్డితో కలిసి ఏర్పాట్లపై ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు

మంగళవారం ఏర్పాట్లపై సమీక్షించారు. బుధవారం శ్రీ పంచమి సరస్వతీ దేవి జన్మ నక్షత్రం కావటంతో ఆలయానికి ఎక్కువ సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు, వెస్ట్ ఏసిపి విస్తృతంగా పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.

జెఇఇ మెయిన్స్‌లో ఫిట్జీ టాప్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్ (విజయవాడ)

జెఈఈ మెయిన్స్ 2024లో విజయవాడ ఫిట్జి కళాశాల దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫిట్జి కళాశాల విజయవాడ డైరెక్టర్ పిన్నెపి రమేష్ బాబు వివరాలను వెల్లడించారు. 2024 జెఈఈ మెయిన్స్ ఫలితాలకు గాను తమ కళాశాలకు చెందిన విద్యార్థులు అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. విజయవాడకు చెందిన తమ విద్యార్థి తోట సాయి కార్తీక్ 100/100 శాతం స్కోరు సాధించి దేశంలోనే టాప్ లో నిలిచాడని తెలిపారు. అలాగే 5 విద్యార్థులు ఫిజిక్స్ లో 100శాతం, గణితంలో 4 విద్యార్థులు, కెమిస్ట్రీ లో 3 విద్యార్థులు 100శాతం స్కోర్ సాధించారని వివరించారు. విజయవాడ సెంటర్ ను ఇండియాలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు అత్యంత వ్యూహాత్మకంగా గోల్డెన్ ఐ ప్రోగ్రాంను 2020లో ప్రారంభించడం జరిగిందన్నారు. 2024మొదటి బ్యాచ్ లోనే అద్భుతాలతో ప్రారంభించామని తెలిపారు. ఈ ప్రోగ్రాం విద్యార్థులు ఇప్పటికే దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో అసాధారణ విజయాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు అధ్యాపక బందానికి, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఫిట్జి డైరెక్టర్ రమేష్ బాబు

పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్

పోషకాహారంతోనే మహిళలకు మంచి ఆరోగ్యం సమకూరుతుందని, మహిళల ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పోషకాహార పంపిణీ సమర్థవంతంగా నిర్వహిస్తోందని 45 డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య కొనియాడారు. మంగళవారం 45వ డివిజన్లోని ఏకలవ్య నగర్‌లో ఉన్న అంగన్వాడి కేంద్రంలో బాలింతలకు పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని మాధురి లావణ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముత్తా వాసు, వెంకట్రావు, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్థంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.